సాక్షి
తూర్పుగోదావరి

శనివారం | 2 | సెప్టెంబర్ | 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఆచంట విజయ నరేష్, మమత శ్రావణి దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడ) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.

'మెడి'కల సాకారం



ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో శుక్రవారం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి.

II లో

న్యూస్‌రీల్

జిల్లాలో 82.10శాతం పింఛన్లు పంపిణీ



దివ్యాంగ పింఛనదారురాలు ఎం.హేమ కిరణ్‌కుమారికి నగదు అందజేస్తున్న వలంటీర్ కోటేశ్వరమ్మ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛను కానుక శుక్రవారం వేకువజామునే లబ్ధిదారుల ఇంటికొచ్చింది. గ్రామ/వార్డు వలంటీర్లు తెల్లవారుజామునుంచే నగదు పంపిణీ చేపట్టారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి సైతం వెళ్లి అందజేశారు. జిల్లాలో కొత్తగా మంజూరైన 4,458 పింఛన్లను తమ పరిధిలో శాసనసభ్యులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 2,37,037 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. తొలిరోజు 1,94,618 మందికి పింఛన్ల కింద రూ.53.65కోట్లు అందజేశారు. 82.10 శాతం లక్ష్యం సాధించారు.

'నన్నయ వర్సిటీ' నూతన కౌన్సిల్



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి నూతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ప్రిన్సిపాల్ సెక్రటరీ జె. శ్యామలరావు జీఓ ఎంఎస్ నంబర్ 77 ద్వారా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు సంవత్సరాల కాలవ్యవధితో కూడిన ఈ కౌన్సిల్‌లో డాక్టర్ పెనుమత్స సురేష్‌వర్మ (సీనియర్ ప్రొఫెసర్, నన్నయ వర్సిటీ), డాక్టర్ పి.విజయనిర్మల (ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), డాక్టర్ కె.జ్యోతి (ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నిడదవోలు), డాక్టర్ కె.నూకరత్నం (అసోసియేట్ ప్రొఫెసర్, నన్నయ వర్సిటీ), వసంతలక్ష్మి (ఏఎస్‌డీ విమెన్స్ కాలేజీ, కాకినాడ) లతోపాటు నలుగురు సంఘ ప్రముఖులుగా షేక్ సుయేమాన్ (జనరల్ మేనేజర్, ఈడీసీఐఎల్), గంధం నారాయణరావు (కరస్పాండెంట్, లిటిల్‌రోజ్ డిగ్రీ కాలేజీ, ద్రాక్షారామం), రాజ్‌కుమార్ (జీఎం, దేవి ఆక్వా ఫీడ్స్), వై.సత్యనారాయణ (రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్, కమర్షియల్ టాక్స్)లను నియమించారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం కావడంతో ఉదయం నుంచి వేలాదిలా భక్తులు తరలివచ్చారు. ఆ వివాహాలకు తరలివచ్చిన భక్తులు, స్వామివారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి.

రాజన్నా.. నీ స్మృతులు పదిలం



సాక్షి, రాజమహేంద్రవరం: అభివృద్ధి ప్రదాత.. ప్రజల ఆత్మబంధువు దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా సంక్షేమం, అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ అనేక పథకాలకు శంకుస్థాపనలు చేపట్టారు. వ్యవసాయ రంగాన్ని అగ్రపథంలో నిలిపేందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అన్నదాతకు అండగా నిలిచేందుకు బడ్జెట్‌లో సింహభాగం రైతుల సంక్షేమానికి నిధులు కేటాయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి మెరుగైన వైద్యం అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఊపిరి పోశారు. విద్య, వైద్యం, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో సంపూర్ణ పురోగతి సాధించి జిల్లా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. సుదీర్ఘ పాదయాత్రలో విన్న సమస్యలకు అధికారంలోకి వచ్చాక కార్యరూపం ఇచ్చారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

రూ.800 కోట్లతో గామన్ బ్రిడ్జి నిర్మాణం:

▸▸ విజయవాడ–విశాఖపట్నం నగరాల మధ్య రాకపోకలు మరింత సౌకర్యవంతంగా చేసేందుకు వైఎస్సార్ రూ.800 కోట్లతో గామన్ బ్రిడ్జి, అప్రోచ్‌రోడ్డు పనులు చేపట్టారు. 14 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగ్గా.. 4.5 కిలోమీటర్ల వరకు గోదావరి నదిపై వంతెన నిర్మించారు. 2008లో పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణంతో విశాఖ–విజయవాడకు 40 కిలో మీటర్ల దూరం తగ్గింది.

▸▸ బ్రాహ్మణగూడెంలో రూ.273.28 లక్షలు వెచ్చించి 1200 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. తద్వారా 600 ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం చూపారు. తాళ్లపూడి మండలంలో 4,950 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.8.59 కోట్లు వెచ్చించి పైడిమెట్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. రూ.360.06 లక్షల వ్యయంతో చాగల్లులో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.



తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ప్రధాన కాలువలోకి పారుతున్న సాగునీరు

- జిల్లా అభివృద్ధిలో వైఎస్సార్ కీలక భూమిక
- సాగునీటి ప్రాజెక్టులతో మెట్టరైతుకు మేలు
- ఆరోగ్య శ్రీ ద్వారా వేల మందికి సంపూర్ణ ఆరోగ్యం
- పేల ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం
- నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

▸▸ తాళ్లపూడి మండలంలో సుమారు రూ.500 కోట్లు వెచ్చించి 16 మండలాల్లో 2,06,600 ఎకరాలకు సాగునీరు అందించే తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. కొవ్వాడ కాలువ వరద ముంపు నివారణకు రూ.56 కోట్ల వ్యయంతో అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మించారు. కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో 15,000 ఎకరాలకు వరద ముంపు సమస్య తీరింది.

▸▸ వైఎస్సార్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టులో ఎక్కువ పనులను పూర్తి చేశారు. కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చారు. కుడి, ఎడమల ప్రధాన కాలువలు తవ్వించారు.



2006లో గామన్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. చిత్రంలో నాటి మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు (ఫైల్)

▸▸ మెట్ట ప్రాంత రైతులకు మంచి చేయాలన్న తలంపుతో గోదావరి నదిపై తాడిపూడి సమీపంలో చింతపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. తద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించాని ప్రయత్నించారు. ఆయన హయాంలో పనులు ప్రారంభించారు.

అభాగ్యులకు అండ

అభాగ్యులకు అండగా నిలిచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చే రూ.75 పింఛను సొమ్మును రూ.200లకు పెంచారు. వికలాంగ పింఛను రూ.500కు పెంచిన ఘనత దివంగత నేతకే దక్కుతుంది. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచకుండా పనిచేశారు. ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా చూశారు.

వైఎస్ వల్లే బతికున్నా..



2009లో ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం దరఖాస్తు చేసుకున్నా. అప్పటి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టింది. రెక్కాడితేనే కానీ డొక్కాడని జీవితాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఇది కేవలం దివంగత వైఎస్సార్ చలవే. వైఎస్ వల్లే ఇంతకాలం బతికున్నా. మహానేత చలవతోనే పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేయించుకోగలిగాను. నాకే కాదు వేల మందికి ప్రాణ దానం చేసిన మహానేత వైఎస్సార్. ఆయన ఎప్పుడూ ప్రజల హృదయాల్లోనే ఉంటారు.

– ఆదిరెడ్డి పాపయమ్మ, రాజమహేంద్రవరం

దేశంలోనే ప్రత్యేకత చాటుకున్న రోడ్డు కం రైలు వంతెనపై ఆయన పాదయాత్ర సాగింది. ఆ సమయంలో కొంతమూరు దగ్గర అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా అక్కడే విశ్రాంతి తీసుకుని తిరిగి యాత్ర కొనసాగించారు. మధురపూడి ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న తోటలో ఆరు రోజుల పాటు వైద్యం సేవలు పొందారు. అదే సమయంలో రాజమహేంద్రవరానికి చెందిన నాయకులతో మాట్లాడి ఇక్కడి కష్టసుఖాలను తెలుసుకున్నారు.

నిడదవోలు అభివృద్ధికి అగ్రస్థానం

నిడదవోలులో 2005లో రాజీవ్ నగరబాటలో పట్టణంలో పర్యటించిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజీవ్‌నగర బాటలో పట్టణానికి సుమారు రూ.కోటితో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం, రూ.కోటితో సెంట్రల్ విద్యుత్ లైటింగ్, విద్యానగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. బాలాజీనగర్‌లో రూ.1.64 కోట్ల రూపాయలతో నిర్మించిన 500 కేఎల్ సామర్థ్యం ఉన్న మంచినీటి రిజర్వాయర్‌కు శంకు స్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 28 వార్డు శివారున ప్రతిష్టాత్మకంగా 832 మంది అబ్ధిదారులకు గృహాలను నిర్మించారు. రూ.70 లక్షలతో నూతన మునిసిపల్ కార్యాలయాన్ని నిర్మించారు. దీనికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ కార్యాలయంగా నామకరణం చేశారు.

అర్హత ఉంటే చాలు పింఛను మంజూరు



లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: టీడీపీ పాలనలో ఆపార్టీ జెండా మోస్తేనో, నాయకులకు మొక్కే వాళ్లకో పింఛను అందేది. కానీ నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉంటే పార్టీలకు అతీతంగా ఫించన్ అందుతోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన వారికి ఫించన్‌ల పంపిణీ కార్యక్రమం కొవ్వూరులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 2014–19ల మధ్య టీడీపీ పాలనలో పింఛన్ల కోసం రూ.400 కోట్లు వెచ్చిస్తే నేడు జగనన్న నాలుగు రెట్లు పెంచి రూ.1,765 కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. ప్రతీ యాభై కుటుంబాలను కస్టర్‌గా ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామన్నారు. నియోజవర్గంలో కొత్తగా 729 మందికి పింఛన్లు మంజూరు చేశామన్నారు. గడప గడపకు వెళ్లి తమ ప్రభుత్వం హయాంలో ఏఏ మేలు చేశామో తెలియజేస్తున్నామన్నారు. సాంకేతిక పరమైన సమస్యలతో పింఛన్లు పొందని వారి ఇబ్బందుల గుర్తించి సరిచేస్తున్నారన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి,ఎంపీపీ కాకర్ల నారాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశ్వీరించదించాలని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు,ఎంపీడీవో కె.సుశీల, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్,మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ,పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

బోధనలో శిరీష బాట వినూత్నం



పిట్టా శిరీష

మధురపూడి: జిల్లాలో బోధనాపరంగా ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రకటించింది. వారిలో కోరుకొండ మండలం గాడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పిట్టా శిరీష కుమారి ఒకరు. కరోనా సందర్భంలో వీడియోలు ద్వారా వినూత్న పద్ధతుల్లో బోధించినందుకు ఈ అవార్డు దక్కింది. 1998 ఆగస్టు 15న ఈమె గాడాల ఎలిమెంట్రీ స్కూల్లో ఉపాధ్యాయినిగా చేరారు. 2009లో పదోన్నతి పొంది గోకవరం మండలం కామరాజుపేటకు బదిలీ అయ్యారు. అక్కడ ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. 2017లో గాడాల హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. కరోనా సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా బోధిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించారు. యూట్యూబ్ చానెల్ ద్వారా తెలుగు సబ్జెక్టులో పాఠాలను రూపొందించారు. దీక్షా యాప్ ద్వారా ప్రభుత్వానికి బోధనా పద్ధతి వీడియాలను అందజేశారు. 8వ తరగతి పాఠ్యపుస్తక రచనలో పాలు పంచుకున్నారు. ఏపీఈపాఠశాల యాప్‌లో 8,9,5 తరగతులకు వీడియాలు తయారుచేశారు. 32 వీడియోలకు క్వాలిటీ చెక్కర్, రివ్యూవర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేసింది.



ఉత్తమసేవలకు గుర్తింపు



ప్రధానోపాధ్యాయులు పి. వీర్రాజు

చాగల్లు: చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. వీర్రాజు రాష్ట్ర ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఆయన 1996లో ఎస్‌జీటీగా ఉపాధ్యాయ కెరీర్ ప్రారంభించారు. 1997లో స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)గా ప్రమోషన్ పొందారు. 2014 నుంచి దేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. 2021లో సాధరణ బదిలీల్లో భాగంగా చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వచ్చారు. అప్పటి నుండి స్థానిక పాఠశాలలో సేవా కార్యక్రమాలతో పాటు నాడు–నేడు పనుల నిర్వహణ, ఎన్‌సీసీ క్యాంపులు, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం, ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించడంలో మంచి భూమిక పోషించారు. 2005లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయడుగా అవార్డు స్వీకరించారు. ఈ ఈ ఏడాది ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ప్రభుత్వం వీర్రాజును ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన్ను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు సంక్షేమానికి పూర్తి భరోసా



డెమోచెక్‌ని అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

- కౌలు రైతుల ఖాతాల్లో రూ.7.19 కోట్లు జమ
- 673మందికి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ యోజన పథకం కింద ఈ ఏడాదికి తొలి విడతగా జిల్లాలోని 9,590 మంది రైతులకు రూ.7.19 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.68.62 లక్షలు ఖాతాలకు జమ చేసినట్లు కలెక్టర్ మాధవీలత చెప్పారు. తాడేపల్లిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నగదు జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎంపీ భరత్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ విత్తనం నుంచి పంట విక్రయం వరకు ప్రతి అంశంలోనూ రైతుకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో దెబ్బ తిన్న పంటకు అదే సీజన్‌లో పరిహారం అందించి అండగా నిలుస్తోందన్నారు. ఈ ఏడాది మే,జూన్, జూలై,ఆగస్టే నెలల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఉద్యానవన పంటలకు సంబంధించి 673 రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.68 లక్షలు విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా అందించడం సంతోషకరమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు, అటవీ భూములు, దేవదాయ భూములు సాగు చేసే రైతులకు కూడా ప్రభుత్వం రైతు భరోసా అందిస్తోందన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట ఇచ్చిన దాని కన్నా మిన్నగా రైతులకు ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, అనుబంధ శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లింపు



నేను కౌలుకు అరటి సాగు చేస్తాను. ఈ మధ్య వచ్చిన వరదల వలన సుమారు రూ.30 వేల రూపాయలు వరకు పంట నష్టం జరిగింది. ఉద్యాన, వ్యవశాయ శాఖ అధికారులు మా పంటలను వెంటనే వచ్చి చూశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టం జరిగిన కొద్ది రోజులకే పరిహారం అందజేయడం ఆనందంగా ఉంది. గతేడాది ఐదుగురం గ్రూపుగా ఏర్పడి ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ట్రాక్టరు కొనుక్కున్నాం. మాకు రూ. 3.40 లక్షల సబ్సిడీ అందించింది.

– బోలిశెట్టి చిట్టి నాగు, మద్దూరు లంక

విత్తు నుంచి విక్రయం వరకూ..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా ఆచరణలో చేసి చూపిస్తున్నారు. ఏటా క్రమం తప్పకుండా రైతుకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా ఉన్నారు. నాలుగేళ్లలో 10 వేల మంది కౌలు రైతులకు సహాయం అందజేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు జాయింట్ కలెక్టరు పర్యవేక్షణలో పద్ధతిగా జరుగుతోంది. వ్యవసాయ సంబంధిత అవసరాలను తీర్చేందుకు ఆర్బీకేల వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత ముఖ్యమంతి సీఎం జగన్‌మోహన్ రెడ్డిదే.

– కంటే వినయ్‌తేజ, జిల్లా వ్యవసాయ సంఘం సభ్యుడు

చంద్రబాబు ఓ తిమింగలం

- గట్టిగా దృష్టి సారిస్తే రూ.వేల కోట్ల నల్లధనం బయట పడుతుంది
- ఎంపీ భరత్‌రామ్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద తిమింగలమని, గట్టిగా దృష్టి సారిస్తే రూ.వేల కోట్ల అక్రమార్జన చిట్టా బయట పడుతుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ వ్యాఖ్యానించారు. కౌలురైతులకు రైతు భరోసా సొమ్ము విడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు లెక్క చూపని ఆదాయ వివరాలు వెల్లడించాలని కేంద్ర ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాలపై మీడియా ప్రశ్నించడంతో ఆయన స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దొడ్డిదారిన బోగస్ కాంట్రాక్టర్ల ద్వారా ప్రజాధనాన్ని మళ్లించి తన ఖాతాలో జమ చేసుకున్నట్టు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని, సుమారు రూ.118 కోట్లు చంద్రబాబుకు ముట్టినట్టు తెలుస్తోందన్నారు. ఇది ఎంత వరకూ వాస్తవమనేది త్వరలోనే బయట పడుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా రూ.లక్షల కోట్లు బొక్కారని, ఆయన చేసిన అన్ని పనులపైనా సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తే రూ.118 కోట్లే కాదు..రాష్ట్ర ఖజానాలో మూడొంతుల నిధులు చంద్రబాబు బినామీ దారుల వద్దే మూలుగుతున్నాయన్న విషయం వెల్లడవుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు అక్రమార్జన గురించి చెబుతూనే ఉన్నామన్నారు. ఫోనిక్స్ ఇన్ఫ్రా అండ్ ఫార్ ట్రేడింగ్ అనే సబ్ కాంట్రాక్టు సంస్థ ద్వారా సుమారు రూ.118 కోట్లు నగదు మళ్లింపు జరిగినట్లు కథనాలు వస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, ఐటీ శాఖ సమగ్ర విచారణ చేపట్టి చంద్రబాబు బొక్కేసిన ప్రజా సొమ్మును కక్కించాలని ఎంపీ భరత్ డిమాండ్ చేశారు. గత టీడీపీ హయాంలో నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి చదరపు అడుగుకు రూ.12వేల నుంచి రూ.14 వేలు ఖర్చయిందని చెబుతున్నారని, రేకుల షెడ్డు మాదిరిగా నిర్మించిన దానికే రూ.వేల కోట్లు ఎందుకయ్యాయో తెలియదన్నారు. గట్టిగా అయితే స్క్వైర్ ఫీట్‌కు రూ.2వేలు కాదన్నారు. ఢిల్లీలో పార్లమెంటు భవనానికి కేవలం రూ.700 కోట్లు మాత్రమే వ్యయం అయిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ భరత్ ఉదహరించారు.

క్లుప్తంగా

సీహెచ్‌సీల్లో గుండె జబ్బుల ప్రథమ చికిత్స

- పైలట్ ప్రాజెక్టుగా అమలు
- తూర్పు గోదావరి కలెక్టర్ మాధవీలత


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గుండె పోటుకు గురైన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. సీహెచ్‌సీల్లో గుండె వ్యాధులకు ప్రథమ చికిత్స చేసే పైలట్ ప్రాజెక్టును ఈ నెలలో జిల్లాలో ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని మయో కార్డియల్ ఇన్ఫార్షన్, ఎస్‌టీ ఎలివేషన్‌పై వైద్యులు, స్టాఫ్ నర్సులకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఆహార అలవాట్లు, ఒత్తిడి, జీవన విధానం, ఎసిడిటీల వల్ల సమాజంలో గుండె జబ్బులు పెరుగుతున్నాయని అన్నారు. గుండె పోటుకు గురైన వ్యక్తిని కాపాడటంలో తొలి గంటా ఎంతో కీలకమని, దీనిని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారని చెప్పారు. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లోని సీహెచ్‌సీల్లో గుండెపోటు బాధితులకు చికిత్స చేయడానికి హబ్, స్పోక్ మోడల్ ఉపయోగిస్తామని తెలిపారు. సీహెచ్‌సీలలో ఐసీయూ, బెడ్, ఈసీజీ యంత్రాలు, మందులు, మానిటర్ల వంటి వైద్య పరికరాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామాల్లో గుండె జబ్బుల బారిన పడిన వారికి సీహెచ్‌సీలలో ముందస్తుగా ప్రథమ చికిత్స చేసి, అనంతరం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ ఎం.సనత్ కుమారి, డాక్టర్ రాణి, హెచ్‌ఓడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

జగ్గంపేట: విషసర్పం కాటు వేయడంతో ఓ కౌలు రైతు మృతి చెందాడు. జగ్గంపేట ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం గుర్రంపాలేనికి చెందిన గంజా మోహనరావు (49) తాను కౌలుకు తీసుకున్న భూమిలో శుక్రవారం వ్యవసాయ పనుల్లో ఉండగా విషసర్పం కాటు వేసింది. దీంతో ఇంటికి వచ్చిన అతడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన జగ్గంపేట సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టానికి తరలించామని ఏఎస్సై నూకరాజు తెలిపారు.

మెడికల సాకారం

- రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం
- మొదలైన తరగతులు
- తొలి రోజు హాజరైన 70 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు


తొలి రోజు వైద్య తరగతులను బోధిస్తున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ చేరిన వైద్య విద్యార్థులు తొలి రోజు తరగతులకు రెట్టింపు ఉత్సాహంతో హాజరయ్యారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తరగతులు జరిగాయి. వారం రోజుల పాటు ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తారు. అనంతరం జనరల్ బోధన ప్రారంభిస్తారు. నెల రోజుల తర్వాత ల్యాబ్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఇదే తొలి రోజు పాఠం

'వైద్యుడు దేవుడితో సమానం అనే మాటను కచ్చితంగా నిజం చేసేలా వైద్య విద్యార్థులు తయారు కావాలి. వైద్యో నారాయణో హరిః అనే మాటను అక్షరాలా నిజం చేయాలి' అంటూ తొలి రోజు కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు, బోధనోపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. మంచి ర్యాంకులు వచ్చినప్పటికీ విద్యార్థులు ప్రపంచ జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మంచి డాక్టర్‌గా ఎలా ఉండాలి, రోగితో ఎలా ఉండాలనే అంశాలను వివరించారు. మనిషి ప్రాణం కాపాడినప్పుడు వచ్చే ఆనందం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా రాదని, అటువంటి పవిత్ర వృత్తిలో ఎదిగేందుకు దేవుడు అవకాశం ఇచ్చిన అవకాశాన్ని వైద్య విద్యార్థులు సఫలీకృతం చేసుకోవాలని చెప్పారు. కళాశాలలో ఏవిధంగా ఉండాలి, ఏ పద్ధతులు పాటించాలి, వైద్య విద్యార్థుల పాత్ర ఏమిటనే విషయాలను వివరించారు. ఎంతటి విద్యార్థులైనా ఉపాధ్యాయుల ముందు చిన్నవారేనని, మంచి ర్యాంకు వచ్చినా మంచి మనస్తత్వం ఏర్పరచుకోవాలని, మంచి వైద్యులుగా తయారు కావాలని సూచించారు.

పూర్తి స్థాయిలో బోధన సిబ్బంది

నీట్‌లో మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు కళాశాల అధికార యంత్రాంగం నెల రోజులుగా కౌన్సెలింగ్ నిర్వహించింది. మొత్తం నాలుగు విభాగాల్లో సీట్ల భర్తీ దాదాపు పూర్తి చేశారు. ఈ కళాశాలలో మొత్తం 150 సీట్లకు అనుమతి లభించింది. మొత్తం రెండు దశల్లో 120 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇచ్చారు. తరగతులు బోధించేందుకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చారు. వైద్య విద్య బోధనకు మొత్తం 65 మందిని ప్రభుత్వం నియమించింది.

మా ఊరిలో నేనే తొలి డాక్టర్‌ను అవుతా..



మాది ఏజెన్సీలోని మారుమూల పల్లెటూరు. వైద్యం కావాలంటే చాలా దూరం పోవాలి. మా ఊరిలో నేనే తొలి వైద్యురాలినవుతా. చాలా ఆనందంగా ఉంది. కష్టపడి చదువుతా. ఎంబీబీఎస్‌లో మంచి మార్కులు తెచ్చుకుని న్యూరాలజీ చదువుతా.

– గగనశ్రీ, ఎంబీబీఎస్ విద్యార్థిని, పెదసెలగ, విజయనగరం జిల్లా

తరగతులు విజయవంతంగా ప్రారంభించాం



అనుకున్న విధంగానే సెప్టెంబర్ ఒకటో తేదీన రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్య తరగతులు ప్రారంభించాం. విద్యార్థులకు గత నెలలో కౌన్సెలింగ్ పూర్తి చేశాం. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించాం. హాస్టల్ ఏర్పాటు చేశాం. ఇక నుంచి వైద్య విద్య తరగతులు నిరంతరం జీఎంసీలో జరుగుతాయి. అనుకున్న సమయానికి తరగతులు ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు ప్రారంభించింది. ఆ దిశగా కళాశాల వైద్యాధికారులు, ఏపీఎంఐడీసీ అధికారులు కృషి చేశారు.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్

ఆనందం మాటల్లో చెప్పలేనిది



డాక్టర్ అవ్వాలనే నా కల సాకారం కాబోతుంది. కష్టపడి చదవడంతో నాకు ఫ్రీ సీటు వచ్చింది. ఎంబీబీఎస్ తొలి రోజు తరగతులకు హాజరయ్యాను. ఈ ఆనందం మాటల్లో చెప్పలేనిది. నా తల్లిదండ్రులు కన్న కలను నెరవేరుస్తాను. కళాశాలలో అన్ని సౌకర్యాలూ బాగున్నాయి. ఎంబీబీఎస్ పూర్తయ్యాక కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నా.

– ఎస్.విమలాదేవి, ఎంబీబీఎస్ విద్యార్థిని, పిఠాపురం

గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తా..



తొలి రోజు పాఠం మరచిపోలేనిది. ముందుగా మాలో ఉన్న భయాన్ని పోగొట్టారు. మంచి మెళకువలు నేర్పారు. డాక్టర్ అనే పదానికి అర్థం చెప్పారు. మా ప్రొఫెసర్లు చెప్పిన మాటను కచ్చితంగా పాటిస్తాను. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత గైనకాలజిస్ట్‌గా సేవలందించాలనుకుంటున్నాను.

– బ్లెస్సీ, ఎంబీబీఎస్ విద్యార్థిని, కాకినాడ

అస్సలు ఊహించ లేదు



నాకు ఫ్రీ సీటు వస్తుందని అస్సలు ఊహించలేదు. ఇది చాలా ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రుల సహకారంతో వైద్య విద్యలో అడుగు పెట్టాను. విజయవంతంగా పూర్తి చేస్తాను. నా వైద్య విద్యకు అవసరమైన అన్ని సౌకర్యాలూ అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాను. ఆర్థోపెడిక్ వైద్యుడిని కావాలనుకుంటున్నాను.

– మహ్మద్ రజా, ఎంబీబీఎస్ విద్యార్థి, విజయనగరం

వారం రోజుల్లోనే చోరీ సొత్తు రికవరీ

కాకినాడ రూరల్: పట్టపగలే జరిగిన ఓ చోరీ కేసును కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఇంద్రపాలెం పోలీసులు వారం రోజులు తిరగకుండానే ఛేదించారు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రేపూరుకు చెందిన ముర్కొండ దుర్గాప్రసాద్ దంపతులు గత నెల 24న ఇంటికి తాళాలు వేసి, శ్రావణ శుక్రవారం వ్రత సామగ్రి కొనుగోలు కోసం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోని బంగారు ఆభరణాలను దొంగలు దోచుకుపోయినట్టు గుర్తించారు. దీంతో బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు.. ఎస్సై దేవ సుధ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై, సిబ్బంది కేసును అన్ని కోణాల్లో విచారణ జరిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించారు. సరిగ్గా వారం రోజుల్లో.. శుక్రవారం ఉదయం కాకినాడ పాత ఎన్టీఆర్ బీచ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని మధ్యవర్తుల సమక్షంలో ఎస్సై సుధ విచారించగా, వారు నేరం అంగీకరించారు. దీంతో ఈ చోరీ కేసులో విజయవాడకు చెందిన ముద్దాని జగదీష్, మండపేట మండలం జెడ్.మేడపాడుకు చెందిన చింతలపూడి చక్రధారలను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన 81.5 గ్రాముల బంగారు హారం, బంగారు నెక్లెస్, బంగారు గొలుసు, బంగారు బ్రాస్లెట్‌తో పాటు స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనం కేసులో నిందితులిద్దరూ పాత నేరస్తులేనని సీఐ శ్రీనివాస్ చెప్పారు. జగదీష్‌పై చాలా కేసులున్నాయని, చక్రధారపై గంజాయి కేసు ఉందని తెలిపారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉండగా వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది. జగదీష్ జూదంతో, చక్రధార వ్యాపారం చేసి అప్పుల పాలయ్యారు. సులువుగా డబ్బు సంపాదించుకోవచ్చనే ఉద్దేశంతో వీరిద్దరూ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులను రిమాండుకు తరలించారు.

ఉచితంగా న్యాయసేవలు

- అర్హులకు ప్రతి పథకం అందాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత
- ఉమ్మడి జిల్లాలో 4 వివాద రహిత గ్రామాల గుర్తింపు


విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): న్యాయస్థానాలు వివిధ వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అధ్యక్షురాలు గంధం సునీత అన్నారు. అర్హులందరికీ ప్రతి పథకం అందేలా అవగాహన కల్పించడంలో మీడియా తన వంతు కర్తవ్యం పోషించాలని సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని తన చాంబర్‌లో ఆమె శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, మానవ అక్రమ రవాణా బాధితులు, మహిళలు, పిల్లలు, భిక్షాటన చేస్తున్న వారు, మతిస్థిమితం లేక మానసిక చికిత్స పొందుతున్న వారు, దివ్యాంగులు, ప్రకృతి, ఇతర విపత్తుల్లో చిక్కుకున్న బాధితులు, కార్మికులు, అనైతిక, చట్టంతో విభేదించిన బాలలు, వార్షికాదాయం రూ.3 లక్షలు మించని వారు ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని తెలిపారు. నల్సా పథకం–2015లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. విద్యార్థులకు మంచి, చెడు స్పర్శల మధ్య తేడా తెలియజేస్తున్నామన్నారు. సోదర భావం, దేశభక్తి, జాతీయతా భావం పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో చిత్రలేఖనం, వ్యాస రచన, లలిత కళల పోటీలు నిర్వహించాల్సిందిగా విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అసంఘటిత రంగ కార్మికులకు బీమా భద్రత కల్పించేందుకు ఈ–శ్రమ్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేయించాలన్నారు. భవన నిర్మాణ రంగంలో 3,17,707 మంది అసంఘటిత కార్మికులున్నట్లు గుర్తించామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొర్రేడు, రంగంపేట, కొత్తూరు, నెల్లిపూడి గ్రామాలను వివాద రహిత, ఫిర్యాదు లేనివిగా గుర్తించి, నివేదిక పంపామని చెప్పారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి జిల్లాలోని 15 ప్రాంతాల్లో ఉన్న 64 కోర్టుల్లో ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని సునీత తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. దీని ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు, రాజీ పడదగిన క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇటువంటి కేసులను ఉదయం 10 గంటల నుంచి ఆయా కోర్టుల్లో పరిష్కరించుకోవాలని చెప్పారు. విలేకర్ల సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి కూడా పాల్గొన్నారు.

రౌడీల గ్యాంగ్‌వార్

- పూటుగా తాగి.. ఆధిపత్య పోరు
- ఓ రౌడీషీటర్ హత్య
- మరొకరికి తీవ్ర గాయాలు
- అమలాపురం ఈదరపల్లి శ్మశానంలో ఘటన


హతుడు కిషోర్ (పాత చిత్రం


సంఘటన స్థలంలో కిషోర్ మృతదేహం

అమలాపురం టౌన్: పట్టణం సమీపంలోని ఈదరపల్లి గ్రామానికి చెందిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ (24) హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన అడపా సాయి లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈదరపల్లి శ్మశానంలో ఈ సంఘటన జరిగింది. అవివాహితుడైన హతుడు కిషోర్‌పై పట్టణ పోలీసు స్టేషన్‌లో పలు కేసులున్నాయి. ఇటీవల కొన్ని రౌడీ గ్యాంగ్‌లు తరచుగా ఆధిపత్య పోరుకు దిగుతున్నాయి. వీటిల్లో ఉన్న రౌడీలు పూటుగా తాగి, అప్పుడప్పుడు ఘర్షణలకు దిగుతున్నారు. ఇటువంటి ఘర్షణలోనే కిషోర్‌ను ప్రత్యర్థులు మట్టుబెట్టారని పోలీసులు చెప్పారు.

అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ కథనం ప్రకారం.. రౌడీ గ్యాంగ్‌లకు చెందిన కొంత మంది యువకులు తాగిన మైకంలో ఈదరపల్లి రంగా విగ్రహం వద్ద గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఆ గొడవలు రాత్రి సద్దుమణిగాయి. శుక్రవారం ఉదయం వారు మళ్లీ అదే చోట ఘర్షణకు దిగడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి, రంగా విగ్రహం వద్ద ఎవరూ గుమిగూడకుండా చర్యలు చేపట్టారు. ఈలోగా ఈదరపల్లి శ్మశానం వద్ద రౌడీషీటర్ కిషోర్, అతడి స్నేహితుడు అడపా సాయిలక్ష్మణ్‌పై ప్రత్యర్థులు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న కిషోర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. గాయపడిన సాయి లక్ష్మణ్‌ను తొలుత స్థానిక ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నలుగురి పేర్లు వెల్లడి

ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సాయి లక్ష్మణ్‌ను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి ఏరియా ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఈదరపల్లికి చెందిన సతీష్, ఇంద్ర, పట్టణంలోని కొంకాపల్లికి చెందిన రౌడీ షీటర్ ఇండిగుల ఆనంద్, అల్లవరం మండలం గూడాలకు చెందిన సుధీర్‌తో పాటు మరి కొంత మంది తమపై దాడి చేశారని లక్ష్మణ్ తెలిపాడు. వీరిలో ఇండిగుల ఆనంద్ టీడీపీ సానుభూతిపరుడు. టీడీపీ అమలాపురం నియోజకవర్గ నాయకుడు, మాజీ రౌడీ షీటర్‌కు ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. ఈ హత్య తాగిన మైకంలో చెలరేగిన ఘర్షణల వల్లే జరిగిందని డీఎస్పీ అంబికా ప్రసాద్ చెప్పారు. సాయిలక్ష్మణ్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం పోలీసు అధికారులు ఈదరపల్లి శ్మశానం వద్దకు చేరుకున్నారు. ఈ సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై విచారణ జరిపారు. గాయపడిన సాయి లక్ష్మణ్ పరిస్థితిని జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా కూడా స్వయంగా పరిశీలించారు.


అమలాపురంలో దహనమవుతున్న దుకాణం

రెండు పోలీసు బృందాలు

సాయి లక్ష్మణ్ చెప్పిన ప్రత్యర్థుల ఆచూకీ తెలుసుకునేందుకు ఇద్దరు ఎస్సైలతో కూడిన రెండు పోలీసు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. ఎస్సై హరీష్‌కుమార్, ఎస్సై ప్రభాకర్‌ల ఆధ్వర్యాన రెండు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టాయి. కాగా, ఈ సంఘటనలో హత్యకు గురైన రౌడీషీటర్ కిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కిషోర్ అవివాహితుడు. తరచూ వివాదాలకు దిగుతూంటాడని పోలీసులు చెప్పారు.

హత్యకు నిరసనగా దుకాణం దహనం

రౌడీ షీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్యను నిరసిస్తూ అతడి వర్గానికి చెందిన కొందరు స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న ఓ దుకాణాన్ని శుక్రవారం రాత్రి దహనం చేశారు. సప్తగిరి అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న టీడీపీ నాయకుడు, మాజీ రౌడీ షీటర్ గంధం పల్లంరాజుకు చెందిన ఈ దుకాణాన్ని కిషోర్ వర్గీయులు దహనం చేసినట్టు పోలీసులు గుర్తించారు. దహనమవుతున్న దుకాణం వద్దకు డీఎస్పీ అంబికా ప్రసాద్ చేరుకుని స్థానికులను విచారించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి దుకాణానికి నిప్పు పెట్టినట్టు స్థానికులు చెప్పారు. షాపు దహనానికి పాల్పడిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసును లోతుగా విచారిస్తున్నారు. ఈ ఘటనలో పక్కనున్న దుకాణాలు కూడా పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ఈదరపల్లిలోని సతీష్ ఇంట్లో కిషోర్ వర్గీయులు ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే

- రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- వ్రతమాచరించిన 4 వేల మంది మహిళలు
- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- 8న మరోసారి..


వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం నిర్వహించిన ఈ వ్రతాల్లో వేలాదిగా మహిళలు పాల్గొన్నారు. సత్యదేవుని వార్షిక, నిత్య కల్యాణ మండపాలతో పాటు రామాలయం వద్ద ఉన్న రెండు వ్రత మండపాల్లో మొత్తం ఎనిమిది బ్యాచ్‌లుగా ఈ వ్రతాలు నిర్వహించారు. సుమారు 4 వేల మంది మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రత్నగిరి ప్రాంగణం మహిళలతో కిటకిటలాడింది. వ్రతాలకు వచ్చిన మహిళలకు ఉచితంగా జాకెట్టు ముక్క, సత్యదేవుని ప్రసాదం, అమ్మవారి రాగి రూపు, చేతికి కట్టుకునే తోరం అందజేశారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. వ్రతాలాచరించిన మహిళలు ప్రత్యేక క్యూలో సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం వీరికి నిత్యాన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ, సుధీర్, యడవిల్లి ప్రసాద్, నాగాభట్ల రవిశర్మ, అంగర సతీష్‌శర్మ, పాలంకి పట్టాభి తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను పీఆర్‌ఓ పాలంకి జగ్గారావు, ఆలయ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.

అంచనాకు మించి..

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అంచనాకు మించి మహిళలు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం ఎనిమిది గంటలకు వ్రతాలు ప్రారంభించగా ఆరు గంటల నుంచే మహిళలు రత్నగిరికి చేరుకున్నారు. మండపాలన్నీ మహిళలతో నిండిపోగా, అంతకు రెండింతల మంది బయట వేచి ఉన్నారు. దీంతో రెండేసి బ్యాచ్‌ల చొప్పున వ్రతాలు నిర్వహించారు. వార్షిక కల్యాణ మండపంలోనే మొదటి బ్యాచ్ 800, రెండో బ్యాచ్ 900 మంది మహిళలు వ్రతాలు ఆచరించారు. సామూహిక వ్రతాలను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ నెల 8న మరోసారి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నామని ఈఓ తెలిపారు.

పత్రికా ప్రకటన

పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులు అనగా కాంట్రాక్టు ప్రాతిపదికన రేడియోగ్రాఫర్ - 1 పోస్టు ; ల్యాబ్ టెక్నీషియన్ -2 పోస్టులు; ఫార్మసిస్ట్ గ్రేడ్ II - 1 పోస్టు; ఆడియో మెట్రీషియన్ - 2 పోస్టులు మరియు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుమార్టమ్ అసిస్టెంట్ - 1 పోస్టు; ల్యాబ్ అటెండెంట్ -1 పోస్టు ; జనరల్ డ్యూటీ అటెండెంట్ - 8 పోస్టులు ; ఆఫీసు సబ్ ఆర్డినేట్ - 3 పోస్టులు; మరియు ప్లంబర్ - 1 పోస్టు; కలిపి మొత్తము = 20 పోస్టులను భర్తీ చేయుటకు నోటిఫికేషన్ జారీ చేయడం అయినది.

కావున ఈ పోస్టులకు దరఖాస్తు చేయగోరు అభ్యర్థులు తమ దరఖాస్తులను eastgodavari.nic.in వెబ్‌సైట్‌లో పొందగలరు. పూర్తి చేసిన దరఖాస్తులను ది: 02-09-2023 ఉదయం గం.10-30 ని.ల నుండి ది : 08-9-2023 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి వారి కార్యాలయం (కమ్యూనిటీ హెల్త్ సెంటర్), కొవ్వూరు నందు అందజేయగలరు.

కొవ్వూరు
తేది : 01-09-2023

జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి
పూర్వపు తూర్పుగోదావరిజిల్లా

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కిలో)	74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.


93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016-2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్ద్వంద్వంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా-విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!



న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవెల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ - 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ - 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్-ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4-1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్-30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-1, 7-6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6-2, 6-2, 6-7 (6/8), 6-2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6-3, 6-2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3-6, 4-6, 7-6 (7/3), 6-4, 7-6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు - నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) - డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3-6, 5-7తో హ్యూగో నిస్ (మొనాకో) - జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) - కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో లాస్లో జెరె (సెర్బియా) - హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**



కుమారుడితో ఇస్నర్